**నడచి వచ్చే నీలిమేఘం కోసం ఎదురుచూసి చూసి ఆమె కనురెప్పలు బరువుగా వాలిపోతున్నాయి. కాని ఆ నీలిమేఘం వస్తున్న జాడమాత్రంకానరావడంలేదు.**

# వంశీ రాధేయం

## యార్లగడ్డ రాఘవేంద్రరావు.

ఆశగా నిరీక్షించిన ఎన్నో ఒంటరి రాత్రులలో ఇది ఒకటా? అనుకున్న ఆ పాలతి లేచిగురుటాకు అధరాలపై వెలితి నిండిన చిరునవ్వు. ఆ నవ్వు వెంటనే ఆమె గుండెపొరలను చీల్చుకుని బయటకు తన్నుకు వచ్చిందో సుదీర్ఘ నిశ్వాసం.

నీవు కలిసి ఎన్ని రోజులయ్యింది? నీ రావనగరును వీడి రాలేవా! నీవు చూపిన మమతానురాగాలన్నీ నాటకాలేనా? కాకపోతే నా గుండెల్లో తలదూర్చి పిలిచే ఆ పిలుపేదీ? నా కన్నుల్లో నిదురలేచే నీ చిరునవ్వేది? బాధ్యతల బందీవయ్యావా? లేక రాచరికం ప్రసాదించిన భార్యల సన్నిధానం నిన్ను కట్టిపడేసిందా? క్షణమొక యుగంగా గడిచే ఈనిరీక్షణతో నేనుమగ్గిపోవలసిందేనా?

ఉండుండి ఆమె నేత్రాలు సజలమవుతున్నాయి.

పల్చటి మంచు పొరలా కమ్మిన మబ్బుల పరదాలు వాటి మాటున చందమామ. మసకగా, మగత నిదురలా లోకాన్ని కమ్మిన వెన్నెల. పలుచని మబ్బు తెరల గుండా అక్కడక్కడా కనిపిస్తున్న లేత నీలిరంగు ఆకాశం. పరవళ్లు తొక్కుతూ ఒడ్డును ఒరుసుకుంటూ ప్రవహిస్తున్న యమున. ఆ యమునాతీరాన సుందర నందన వనం. అది బృందావనం.

దిగులు దిగులుగా తిరుగాడుతూ కుప్పబోసిన వెన్నెల వెన్నెలరాశిలా, మూర్తీభవించిన సౌందర్యంతో మెరసిపోతున్న ఆమె....రాధ. బృందావని అణువణువు ఎరిగిన, ద్వారకలోని అతి కొద్దిమంది మేధావులలో మెరిసే మణిపూస.

ఆమె ఎదురుచూస్తున్నది కృష్ణయ్య కోసం.

కృష్ణుడు హస్తినాపురికి వెళ్లినప్పటి నుండి రాధ నిరీక్షణ. హస్తినాపురినుండి వచ్చినా ద్వారక రాచకార్యాలలో తీరిక చిక్కడంలేదు కృష్ణుడికి. ప్రజాశ్రేయస్సే కర్తవ్యంగా పాలించే ప్రభువుకనుక ప్రజా సమస్యల చక్కబాటుతోను, కౌరవ పాండవ కుటుంబ కలహాలలో అతడి జోక్యం అధికం కావడంతోను ఊపిరి సలుపని పనులెన్నో నెత్తిన పడుతున్నాయి. ఎన్ని పనుల వత్తిడిలో ఉన్నా ఎంత మందిలో మసలుతున్నా అతడి అంతరంగపు లోయలలో ప్రతిధ్వనిస్తూ, అనుక్షణం నరాలను తాకుతున్న రాధ పిలుపు వినిపిస్తూనేవుంది.

వెళ్లాలనే ప్రయత్నాన్ని నేడు వాయిదా వేసుకోవడానికి వీల్లేదు అనుకున్నాడు కృష్ణుడు.

అందునా నేడు అష్టమి. తన జన్మదినం. ఉదయం నుండి తల్లీ, తండ్రి, భార్యలు, శుభాభినందనలు తెలిపే బంధుమిత్ర సందోహంతో ఒక్క నిమిషం తీరిక, ఒంటరితనం చిక్కలేదు. తన జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలు, ఉత్సవాలలో తను పాల్గొనకపోవడం మర్యాద కాదని భావించి ఇంత సేపు భరించాడు.

ఎంతో అలసటగా అనిపిస్తోంది కృష్ణుడికి. అయినా రాధదగ్గరకు వెళ్లక తప్పదు అనుకున్నాడు. ఆమె సమక్షంలో ఈ అలసట ఎగిరిపోదూ. ఎంతటి ప్రశాంతత, మరెంతటి దివ్యానుభూతి చిక్కుతాయి, ఆమె ముంగిలిలో అనుకున్న కృష్ణుడి అధరాలమీద చిరునవ్వు లాస్యం చేసింది.

సంబరాలు ముగిసి ద్వారక గాఢనిద్రలోకి జారుకునే టప్పటికి రెండవ ఝాము సగంపైనే సాగిపోయింది. ఆసమయంలో కృష్ణయ్య నెమ్మదిగా పట్టణ సరిహద్దు దాటాడు.

ఇక్కడ—

రాధలో నిండిన ఆర్తి, తపన ఆమెను ఒకచోట నిలువనీయడంలేదు. నల్లని పెద్ద కళ్లు మాటిమాటికి దిక్కులు పరికిస్తున్నాయి. ఏ పొదలో అలికిడైనా, చిరుగాలి వీవన ఉధృతమై ఈలవేసినట్లనిపించినా హృదయ స్పందన వేగమై ఆవైపు అడుగులేస్తోంది. ఒక్కోసారి తన కాలి యందెల సవ్వడికే ఉలికులికి పడుతోంది.

దూరంగా ఎక్కడి నుండో మురళీరవం సన్నగా వినీ వినిపించనట్లుగా వినిపించింది. అది అతడిరాక సంకేతం మనసు పలికింది. ఛఛ ఇదీ నా భ్రమే అనుకుంది అంతలోనే.

మళ్లీ సుదూరంనుండి ఆ రవళి వినరావడంతో రాధ కనులు విప్పారాయి. ఒక్కుదుటున కూర్చున్న చోటి నుండి లేచి ఎటునుండి వినిపిస్తోందా అని దిక్కులు పరికించింది. క్రమేపీ మురళీరావం దగ్గరయ్యింది.

ప్రక్కనే పొదలో అలికిడికి అటు తిరిగి చూచింది. ఒక కుందేలు గెంతుకుంటూ వెళ్లింది.

అంతా తనలోని నిండిన తలపులు కల్పించిన భ్రమ ఏమోననుకుని రెమ్మలు రాల్చిన పారిజాతా లేరుకుని దోసిట నింపుకుని వాటి పరిమళాల్ని ఆస్వాదిస్తూ వటవృక్షానికానుకుని ఆకాశాన్ని చూస్తూ ఆలోచనలోపడింది

కస్తూరీ చందన పరిమళాలు నాసికాపుటలకు తగిలి వినమ్రతతో పక్కకు తిరగబోయిన ఆమె కనుదోయిని రెండు మృదుహస్తాలు మూశాయి.

ఆ హస్తస్పర్శనుండి రాధ మేనులోకి పాకిందో పులకరింత. తన తనువు ప్రతిక్షణం కోరే స్పర్శ. ఏ స్పర్శ కోసమై తాను సృష్టింపబడిందో అ మృదుస్పర్శ. ఆ స్పర్శ, అందులోని పులకరింత ఎవరి హస్తాలనుండి ఉద్భవించగలదో రాధకు అనుభవమే.

చేతిలోని పారిజాతాలు జారి పాదాలను చేరగా తన హస్తాలతో నయనాలను మూసిన హస్తాలను సున్నితంగా తొలగించి, ముందుకు తన భుజాల మీదుగా లాగి పెదవులతో తాకి ఆ తర్వాత వెనుదిరిగి చూచింది.

ఎదురుగా నిలిచి నవ్వుతున్న నీలి మేఘం. ఆ నవ్వు వెన్నెలనే వెక్కిరిస్తున్నట్లుగా వుంది.

''వంశీ'' లతలా పెనవేసుకుపోయింది ఆత్రంగా.

''రాధీ'' పొదివిపట్టుకున్న కృష్ణుని గుండె లోతుల నుండి తన్నుకువచ్చిన పిలుపు. సృష్ట్యాది నుండి జీవిలో నిండిన చైతన్యంలో లీనమైపోయిన విచిత్ర స్పందనలు గడచిన కాలాలనుండి పునరుద్భవించి ఆ పిలుపులో ఒదిగి అనంతమైన శక్తినొసగిన పదమది.

ఒకరినొకరు కలుసుకున్న భావావేశంలో భాషను మింగిన మౌనం మౌనంగా, మధురంగా ప్రణయ రాగం ఆలపిస్తోంది.

అంతలోనే కృష్ణుడిని దూరంగా తోసి మోము మరోవైపుకు తిప్పుకుంది రాధ. అతడు ముసిముసిగా నవ్వుతూ ఆమె చుబుకం పట్టుకుని తన వైపు తిప్పుకుని అలకేల రాధీ అన్నట్లు చూశాడు


రాధ మరింతగా బిగదీసుకుపోయింది. రాధీ! మాట్లాడవూ చిన్నపిల్లాడిలా గోముగా అడిగాడు.

అప్పటికే రాధ మాట్లాడక తనగోటితో వటవృక్షం బెరడుగీరుతూ నిలుచుండి పోవడంతో ఇన్నాళ్లుగా రాకపోవడానికి, ఈ నాటి నా ఆలస్యానికి ఈ అనురాగమయి ఏ శిక్ష విధించినా అనుభవించడానికి సిద్ధంగా వున్నాను. అంటూ మురళిని పట్టుకున్న చేతులు జోడించి నిలబడ్డాడు.

కల్లబొల్లి కబుర్లకేం కొదవలేదు. చేతిలోని చెట్టు బెరడుముక్కను దూరంగా విసిరేస్తూ అంది రాధ.

''నన్ను నమ్మవా రాధీ'' జాలిగా, దీనంగా అడిగిన కృష్ణుని స్వరంలోని మార్పుకు చలించి అతడి వైపుకు తిరిగి—

పిచ్చి వంశీ! ఈ రాధ నీ భార్య సత్యకాదు. నమ్మకపోవడానికి, శిక్షించడానికి, ఆజ్ఞాపించడానికి. ఇన్నాళ్ల




## అతి 'ధీ'

తిథి చెప్పకుండా రావటమే కాక వెళ్ళిపోతే ఇంటి వాళ్ళు ఏమనుకుంటారేమోనని నెలవారీ టిక్కెట్ల మకాం పెట్టే అతి 'ధీ'మంతులు.

నీవు రాకపోవడంతో నాలోని కలవరం నీ కర్తవ్యాల్ని, నీ బంధనాల్ని మరచిపోయేలా చేసింది. అంతే "ఒక్క క్షణమాగి కేవలం నీ ప్రేమను కోరుకుని, ఆ ప్రేమలోనే నా బ్రతుకుని పండించుకోవాలని, అందులోనే తరించిపోవాలనుకునే ఒక అభాగినినినేను అంది. జోడించిన కృష్ణయ్య చేతులను తన అధరాలతో స్పృశిస్తూ. తాను నటించే అలుకను ఆవలకు పెట్టి.

అభాగినివి కాదు రాధీ! నా ఆత్మజ్యోతివి. నా అంతరంగపు ప్రతిరూపానివి. భార్యలెందరున్నా బ్రతుకు తృప్తిగా సాగడానికి, నిత్య నూతనోత్తేజానికి, మానసికావసరమైన ప్రేమను నాకిచ్చి నానుండి దాన్ని సంపూర్ణంగా తిరిగిపొందిన ఏకైక స్త్రీవి"

ఆ గొంతులో, ఆ పదాలలో, పదాలుగా వెలువడిన శబ్దాలలో అనంతమైన శక్తి, అగోచరమైన ఆ శక్తి, రాధ శరీరపు అణువణువున చేరి దీప్తిమంతం చేసింది.

అకస్మాత్తుగా తానింత వరకు కృష్ణునికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపలేదని గుర్తొచ్చి "అభినందనలు నేస్తం. జన్మదిన శుభాభినందనలు" అంది కృష్ణుడి కళ్లలోకి చూస్తూ.

ఇంత ఆలస్యంగానా తెలిపేది?

"ఆలస్యంగా వచ్చినందుకు ఆలస్యంగా అభినందనలు తెలపడమే ప్రతిశిక్ష, నవ్వుతూ అంది.

"అహ" అని ఆమెను దగ్గరగా తీసుకుంటూ ఎంత సేపటి నుండి ఎదురుచూస్తున్నావు అన్నాడు.

యుగాలుగా అని అంతలోనే అయినా వంశీ! ఇది పిచ్చిప్రశ్న. ఈ నిశీధి రోదనను వింటూ దానికి తోడుగా, ఒంటరిగా, ఈ నిశ్శబ్దంలో, ఈ నిరీక్షణతో ఎన్ని రోజులు, నెలలు గడుపుతుంటానో నీకు తెలీదూ. ఒకే ఒకసారి నీ కళ్లలోకి చూసి ఆ కంటిపాపలోని నా రూపాన్ని చూసి మురిసిపోవాలనే కోరికలో నేను దహించుకుపోవడం నీకు తెలీదూ" క్షణమాగి "నా పిచ్చిగాని నీవని, నేనని వేరేమిటి? ఇద్దరం ఒకటే కదూ" పసిపాప మారాం చేస్తున్నట్లుగా అంది.

"అవునోయి" ప్రేమగా ఆమె పెదవులను చుంబించాడు కృష్ణయ్య. అతడు రానంత వరకు గుండెను పిండిన నిశ్శబ్దం పారిపోయింది. శరీరమంతా నిండిన ఆరాటం నిలువనీయనిఆనందమైంది. స్తంభించినకాలం పరుగు మొదలుపెట్టింది.

ఒక్కటే అయినా నా రూపాన్ని ఎదురుగా చూసుకోవాలనే తపన. అబ్బ ఆ వియోగం ఎంత భయంకరమైనది. ఆగి మళ్లీ తనే అంది భయంకరమైనదైనా అదీ మధురమే కదూ"

"ఏమిటీ విరుద్ధ భావన"

కృష్ణుడి ప్రశ్నకు సమాధానం చెప్పకుండా అతడి జుట్టు చెరుపుతూ వంశీ! మనిషిని రగిల్చి నిలువునా కుదిపి, స్థిరత్వ మనేది లేకుండా చేసి అస్థిరత, అశాంతితో నిలిపేంతటి శక్తి ఈ విరహానికెక్కడిదోయీ అనడిగింది.

ముద్దుగా, ముచ్చటగా రాధను చూస్తూ పసికూనవైపోయావా?" అనన్నాడు పరిహాసంగా

"అబ్బ! పరిహారం తర్వాత చెప్పవూ"

"తప్పదా"

"తప్పదు'

"ఆజ్ఞ శిరసావహిస్తాను చెలీ" అంటూ మొదలు పెట్టాడు.

'పంచభూతాలలో నశించనిదైన తేజస్సు ఆత్మ. జీవ చైతన్యానికి మూలమైన ఈ ఆత్మ దేహాంతర్భాగమంతటా నిండి ఉంటుంది. అంటే శరీరమంతా తేజఃపుంజాలతో నిండి వుంటుంది. ఈ ఆత్మలో మనసు రమిస్తుంటుంది. మనసును ఒక విషయంపై లగ్నం చేసి ఆ ధ్యానంలోనే దానిని జ్వలింపచేస్తే కలిగే ఏకాగ్రతలో తను కేంద్రంగా చేసుకున్న భావమే సర్వత్రా దర్శనమిస్తుంటుంది. ఆ స్థితిలో ఏకబంధానికి లోనయిన ఆత్మలు ఒకదానిలో ఒకటి లయించిపోయి ఒకరిలో మరొకరి రూపాన్ని ప్రతిబింబిస్తుంటాయి. అనగా ఏకాగ్రత చెదరనంతవరకు ఆ రూపంతో, ఆ వ్యక్తితో తను లయించిపోయిన భావన కలుగుతుంది. ఈ స్థితిలో బాహ్యమైన దూరం ప్రభావం చూపిస్తుంది. దాన్నే విరహం, వియోగం అంటాం. ఈ బాహ్యమైన దూరం తరిగి ఒకరి సమక్షంలో ఒకరు నిలిచినపుడు భౌతిక వాసనలు మిగుల్చుకున్న మనసు లయించిన ఆత్మల్లో లీనమైపోవాలనే తపనలో నుండి ఉద్భవించి హోయిగొలిపేవే పులకింతలు, మధురానుభవాలు. అసలు ఆత్మలు లయించిపోనపుడు ఈ స్పందనలుండవు. అది ఎటువంటి వికారాలు లేని శూన్యస్థితి. ఒక్కొక్కసారి బాహ్యమైన దూరం ఏర్పడినా అంతర్గతంగా నిలిచిన ఈ స్పందనలు ఆ దూరాన్ని చెరిపేస్తాయి. అప్పుడు కలిగేది, ఏర్పడేది అంతరంగపు స్వప్నావస్థ"

ఈ మాట వింటున్నప్పుడు కృష్ణుని నల్లకళ్లలోని వింతవెలుగులు తనను కమ్ముకుని తనలో నిండిపోయినట్లనిపించింది రాధకు. ఆ వెలుగు తననేదో లోకాలకు తీసుకుపోతున్నట్లు, అవ్యక్తమైన, అద్భుతమైన అతి సుందరమైన, ఏదో ఒక దివ్యమంగళరూపం ఎదుటనిలిపినట్లు, ఆ రూపం తనబాహువులతో తనను పొదివి పట్టుకున్నట్లు అన్పించిందామెకు.

కనురెప్పలు రెప రెపలాడాయి. నేత్రాలను ఒక్కసారి మూసి తెరచిన రాధకు కృష్ణుని చేతుల్లో ఇమిడిపోయిన బాహ్యస్థితి తెలిసివచ్చింది. గడచిన క్షణం ఎవరి ఊహ కాదని, తన మేధను వికసింపచేసే కృష్ణుని ఆలోచన పలికిన నిమిషమని తెలిసి, మౌనంవహించింది.

రాధ చెక్కిళ్లను తన వేలితో రాస్తూ కృష్ణుడేం మాట్లాడలేదు.

"వంశీ" అని పిలిచింది చాలాసేపటికి.

"ఊఁ" "యమునాతటానికి వెళ్దామా'


ఇరువురూ బృందావని అంచున వున్న యమునను చేరి ఒడ్డున వున్న ఇసుక తిన్నెలపై కూర్చున్నారు.

సాగే యమున నీటిపై పరచుకున్న వెన్నెల కిరణాలు, మెరిసే నక్షత్రాలతో పోటీపడి మెరుస్తున్న తీరంలోని తెల్లని ఇసుకరేణువులు. అలలు అలలుగా నీటి మీద నుండి తేలివస్తూ హాయిగొలుపుతున్న వాయుతరంగాలు

ఎంత ఆహ్లాదకరంగా వుంది రాధీ ఈ వాతావరణం. ప్రతిక్షణం నీ సన్నిధిలో ఈ యమునా తీరంలో గడపాలని ఉంటుంది. కాని ఎన్ని బాధ్యతలు, ఎన్ని బంధాలు"

నీ బాధ్యతలను వదులుకోమని అనను. కానీ ఈ నిరీక్షణలో నీరసించి వడలిన తీగగా నేను మారినపుడు, ఎదలో ఊపిరి నిలిపి జీవం పోసే నీ పలుకు కావాలంటాను. అది నాలో వేయి సౌదామినుల కాంతిని నింపి ఇంకెన్ని యుగాలైనా నీ నిరీక్షణలో సజీవురాలిని చేస్తుంది నన్ను"

"స్త్రీత్వం అంటే ఏమిటో, ఆలోచుల్లో ఎంతటి అనురాగం, ఆరాధన వుంటాయో నా అనుభూతికి



తెచ్చినదానవు నీవు. నేను భౌతికంగా దూరమైనా ప్రతి క్షణం అంతరంగికంగా మన మధ్యదూరాన్ని తగ్గిస్తూ నన్ను నీలో లయించిపోయేలా చేస్తుంది రాధీ'' అంటూ రాధ కళ్లను ముద్దాడాడు కృష్ణుడు.

''వంశీ'' ఒకవిధమైన తన్మయతలో కూరుకుపోయిన రాధ, కృష్ణుని ఒడిలో తలపెట్టుకుని తన మృదు హస్తాలతో అతడి మెడను చుట్టి 'ఆ మురళిని మ్రోయించవూ' గోముగా అడిగింది.

అది అర్థింపు కాదు. ఆజ్ఞ. ఆ ఆజ్ఞ కృష్ణుని కానందం. సంతోషంగా ఆదమరచి ఆలపిస్తాడు.

కృష్ణుని అధరాలు మురళిని తాకాయి. వెదురుల నిదురించే నిశ్శబ్దం మెల్లగా నాదమై,
నాదం రాగమై, రాగంలో గీతం సంగీతమై సన్నగా సాగి సాగి ఆపై ఉధృతమైంధి. శూన్యం నిండిన వేణువులో వేయి రాగాలను పలికించే ఆ అధరాలు రాధ కెంతో ఇష్టమైన మోహన రాగ గానాన్ని సృష్టిస్తుంటే ఆరవళిని మోసుకెళ్లే గాలితరంగాలులలల నురుగుతో చెప్పే గుసగుసలను వినడానికి ప్రయత్నిస్తూ విభ్రమతో, సంబరంతో రేయంచుల నిండా నిండిన తన వాడిని చూసుకుంటోంది రాధ.

ఉన్నట్టుండి ఒక్కఉదుటున లేచి నిలబడింది. ఆమె కాలి అందెలు ఘల్లుమన్నాయి. కృష్ణుడి హృదయంలో వేయి విద్యుత్ తరంగాల ప్రసరణ. గానం ఆగిపోయింది.

ఆపవద్దన్నట్లు సైగచేసింది రాధ. మళ్లీ మొదలయ్యింది కృష్ణుని మోహనరాగాలాపన.

రాధ పాదాలలో అలజడి. చరణమంజీరాల వింత సవ్వడి. కదలికలో వయ్యారం అది నృత్యం. తనువంతా నిండిన తలపుభారపు ఫలం ఆ నర్తనం.

ప్రతిపదంలో ఒక స్పందన, ప్రతి ఒంపులో ఒక తన్మయత, ప్రతి కదలికలో పులకింత, పరిమళ పవన వీవనం అభినయంలో ఆరితేరిన తనం, అల్లరితనం, ఆరాధనాభావం.

ఆ నాట్యం కృష్ణుని కోసమే. అది అతడి సొంతం! ఆ గానం రాధకోసమే! అది ఆమె ప్రాణం! పరాకాష్ఠకు చేరిన ప్రతిభకు ప్రతీకలు వారిరువురు.

అలా సాగి సాగి ఆ నృత్యగానా లోకేక్షణాన ఆగిపోయాయి. తడబడే అడుగులతో వచ్చి కృష్ణయ్య ఒడిలో వాలిపోయింది రాధ. తన చేదోయితో కృష్ణుని మోము పట్టుకుని అతడి కళ్లలోకి అనురాగపూర్వకంగా చూసింది. కృష్ణుడి పెదవులపై మందహాసం లాస్యం చేసింది. చటుక్కున ఆ పెదవులను ముద్దుపెట్టుకుంది.

''వంశీ!''

''ఆ''

''నీ చూపు, ఆ గానం, ఆనవ్వు, ఆస్పర్శ అన్నీ కలిసి నన్ను దహిస్తున్నాయి. ఈ పారవశ్యాన్ని మోయలేకపోతున్నాయి'' అంది. రాధ కురులను పైకిలేపి వదలుతూ వాటినుండి వచ్చే సాంబ్రాణి, చందనాది సువాసనల నాఘ్రాణిస్తూ ఆమె పలుకులు వింటున్నారు. ఒక పక్క పారవశ్యపుభారం మరో పక్క ఇంకా తపన, ఆవేశం ఎందుకో అర్థంకావడంలేదు.



అదే ప్రణయ రహస్యం రాధీ, ప్రణయ సాఫల్యత కూడాను. ఆ ప్రేమోపాసనలో చివరి అంకంలో కరిగిపోతున్న ఆ తృష్ణే ఆ తపనే ఆఖరిది. ఆ తర్వాత మిగిలేది నిశ్చలస్థితి. సాధించిన సంతృప్తి''

''ఆ స్థితి నాకొద్దు. ఈ తపనలోనే నీ మీది ఈ వాంఛలోనే నేను ఆహుతైపోవాలి. నీవులేని వేలక్షణాలు నన్నెంతగా బాధించినా నీవు దొరికిన ఒక్క క్షణపు కలయిక నాలో మిగిల్చి తృప్తి, నీలో నిండే సజీవ చైతన్యానురాగానుభూతి నాకు మళ్లీ మళ్లీ కావాలి''

అలా జరగకపోతే ఈ అనురాగమంతా ఎండిపోతుందా ఆమె ముంగురులు సవరిస్తూ పరిహాసంగా అడిగాడు.

''వంశీ'' దెబ్బతిన్న నెమలి క్రేంకారంలా వినిపించింది కృష్ణుడికి. రాధ కళ్లల్లో యమున సుడులు తిరిగింది. ఆ కంటి అంచున క్షణికంలో నిలిచిన నీటి బిందువులు వెన్నెల్లో మంచి ముత్యాల్లా మెరుస్తున్నాయి.

''పరిహాసానికంటేనే ఇంత బాధేల రాధీ ఆమె ముఖాన్ని పట్టుకుని, ఆ కన్నీటి ముత్యాలను తుడిచి సింధూరం పెట్టుకున్నట్లుగా తన నుదుట అద్దుకుని గలగలా నవ్వాడు.

''అదేమిటీ''

''ఇవి నీ ఎదలో ఉద్భవించిన ప్రేమ కుసుమం పుష్పాంజలి. వాటిని నా నుదుట అలంకరించుకున్నాను. తప్పా?'' అమాయకంగా ప్రశ్నించాడు. రాధ ఏదో అనబోయేంతలో తనవేలితో ఆమె బుగ్గమీద రాస్తూ— ఈ స్త్రీత్వం, ఈపసితనం, ఈబేలతనం, మూర్తీభవించిన ఈ విజ్ఞానం, ఈ స్పందన నావి అనుకున్నపుడు నాకెంతో తృప్తి అన్నాడు గంభీరంగా.

రాధ ఏం మాట్లాడకుండా బలంగా అతడిని అల్లుకుపోయింది. కృష్ణుని ఒడలంతా జలదరింపు, నరనరాన ఉద్రిక్తత.

''ఏయ్ కొంటే'' అంటూ రాధ గుండెల్లో తన మోము దాచుకున్నాడు. కోరికజనియింపజేసే ఉన్మత్తత నిండుగా నిండగా.

ఎంతోసేపటి తర్వాత తన చేతులు రెండిటిని రాధ నడుము చుట్టూ చుట్టి తన ముఖాన్ని ఆమె ఉదరం

మీద అటు ఇటూ రుద్దుతూ మెల్లగా అన్నాడు. ఈ జగతిలో దేనికీ లొంగని నేను, ఎందుకు నీ ఈ వలపుకింతగా లొంగిపోతున్నాను. ఏదీ అంటని నా మనసును ఏ పాశం నీ వైపుకు లాగుతుంది. ఎన్నో సార్లు తనలో తానే ప్రశ్నించుకునే ప్రశ్న బహిర్గత మైందీ మైకంలో, తమకంలో

సృష్టి ఆదితో ఊపిరులు పోసుకున్న తొలి అణువులం మనం. ఆ సృష్టి అంతమయ్యే వరకు నిత్య ఊపిరులతో నవజీవంతో నిలిచిపోయే అణువులం. నిరంతరం నిన్ను నన్ను విడదీయక కలిపేది కాలానికి అతీతమైన ఆ భావనే కాలంలో జనియించి, కాలంలో లయించి పోయే కాలానికే అతీతంగా నిలిచే ప్రకృతి పురుషులం మనం. అదే మన సృష్టి రహస్యం, మన బంధం స్వరూపం'' అంది రాధ.

కృష్ణుడు సాలోచనగా ఏదో అనబోయేంతలో తనే ''ఈ సృష్టి ఎంత విచిత్రం. ఏదో చెప్పుకున్నా ఒక పట్టాన ఎవరికో అర్థంకాదు. అంతు బట్టదు. నీవు సృష్టి మర్మాన్ని వివరించగలవా వంశీ, అనడిగింది— అన్నీ తెలిసినతనం నుండి ఏమీ తెలియనితనంలోకి పయనిస్తూ.

''మళ్లీ శిష్యురాలివై పోయావా?''

''ఊ నీకంతా పరిహాసమే''

''కాదులే చెబుతాను'' అని రెండు క్షణాల పాటు యోచించి రాధను చూస్తూ ఇలా అన్నాడు.

''అనంత విశ్వంలో అనాదిగాజరిగిపోతున్న కంటికి ఆనని కాలం తన గమనంతో కోట్లవత్సరాలుగా గడచిపోయిన చరిత్రను, పరిణామాన్ని తనలో ఇముడ్చుకుని. తుది తెలియక లేదా తెలియని తీరం వైపు సాగిపోతోంది.ఈ పరిణామక్రమమనేది జరుగుతున్న అద్భుతం. ఆ అద్భుతత్వంలో నిలిచిన కాలంలో ప్రతీదీ క్షణికం, అనల్పం. అది అవగతం చేసుకోగలగడమే సంపూర్ణత్వమూ, తేజస్సును పెంచుకోవడమూ. తేజస్సు జ్ఞానం జ్ఞానం కాంతి, కాంతిసర్వభూతం, సర్వాధారం సంపూర్ణంగా దీన్ని గ్రహించగలిగి నపుడు స్థితిరహితమైన కాంతిగా మిగిలి సర్వత్రితమైన విశ్వజనీన కాంతి లయించి పోవడం జరుగుతుంది.

కాంతిచేత, కాంతివల్ల సృజియించబడే ప్రతిస్థితీ పరిణామం చెంది తిరిగి కాంతిలో విలీనం కావడమే సృష్టిగా పిలవబడుతోంది. కాంతిని శక్తి అనికూడా చెప్పుకోవచ్చు. ఈ తత్వాన్ని అర్థం చేసుకోవడం కోసమే ఈ జీవితాలు. ఇంకొక విధంగా చెప్పుకోవాలంటే కాంతిలోనుండి కాలంలోకి జారి, సాగి, తిరిగి కాంతిలోకి పయనించడమే జీవితం. జీవితాన్ని ఇలా నిర్వచించుకున్నపుడు కాలంలోకి జారిన కాంతి స్థితిసహితమవుతుంది. కనుక మార్పులు చెందే ఆ స్థితి బహిర్గతంచేసే తేజస్సులో తీవ్రత తగ్గకుండా స్థిరత్వం పొందగలగడమే పరిణతి చెందడం. ఇదే సృష్టి మనుగడలోని రహస్యం.

తెలుసుకుని లయించిపోవడమే సృష్టికి మూలం. ఆధారం. రూపం అయితే ఈ జనన మరణాలెందుకు. నడుమ ఈ బంధాలెందుకు నిత్యమూ సృష్టిలోనేలయమైన స్థితిలో వుండిపోవచ్చుగా'' జిజ్ఞాసతో ప్రశ్నించింది రాధ.

సృష్టికి నిశ్చలత్వంలేదు. నిరంతర పరిభ్రమణం ఆ భ్రమణంలో పరిణతి చెందడం దాని స్వభావం. అదే దానికి అందం. పరిపూర్ణ పరిణతిని సాధించినదేసంపూర్ణంగా లయించిపోవడానికి అర్హత కలిగివుంటుంది. ఆ దిశలో సాగే పయనంలో సంభవించేవే జనన మరణాలు. అయితే జనియించడం నుండి మరణించడం వరకు ప్రతి అనుభవం ఎంత అవసరమైనదో అంతటి అసందర్భమైనది. అసత్యమైనది, అనిత్యమైనది. అది తెలుసుకోవడానికే ఒక జీవితకాలపు సంఘర్షణ. రూపం తెలియని సుందరచిత్రాన్ని చిత్రించుకోవడంలో పడే ఆరాటమే కాలంలో అత్యంత సూక్ష్మమై నిలిచి పోయే ఈ జీవితం.''

జ్ఞానం సంపూర్ణంగా మూర్తీభవించిన పవిత్ర రుషిలా కన్పిస్తున్న అతడి చుట్టూ, తన చుట్టూ ప్రకృతిలో అగోచరంగా వ్యాపించిన శ్వేత తేజస్సు వలయాలు వలయాలుగా తిరుగుతున్నట్లనిపించింది రాధకు.

అయితే మనమూ మనలోని ఈ భావ పరంపరా నిత్యజాగృతి అన్నీ అవాస్తవాలేనా? ఉట్టి భ్రమలేనా?' అని ప్రశ్నించింది రాధ.

''కాదు. ఈ క్షణానికి సత్యం, నిత్యం. మరుక్షణానికి

అసత్యం, అనిత్యం. ఒక స్మృతి. జరిగిందే అనిపించే వాస్తవమైన భ్రమ. ఆ భ్రమపొరలను ఛేదించుకుని నిత్యమూ, జీవవంతమైన సృష్టిరేఖలలోని పరిమళాలను ఆస్వాదించ గలిగి దానితో మమైకం చెందడమే అసలైన వాస్తవం. నిజమైన విలువ పరిపూర్ణమైన పరిణతి..''

రాధ మాట్లాడక, అతడి పలుకులను అవగతం చేసుకుని అందలి వాస్తవాలను గ్రహించడానికి ప్రయత్నిస్తోంది.

కొన్నిక్షణాల తర్వాత కృష్ణుడే అన్నాడు ప్రాపంచిక తత్వానికే మనం పరిమితమైపోతే మనలో నిజమైన విలువగా మిగిలేది, మనకు పరిణతి ప్రసాదించేది అసలైన మానవత్వం. అందు దాగిన విశ్వ ప్రేమతత్వం.''

మరి నీలో నాలో ఏమున్నాయి తన జిజ్ఞాసలో నుండి ఐహికత్వంలోకి మేలుకుంటూ అడిగింది రాధ.

నీలో మమత ఆరాధన, నాలో వాటితోపాటు నేను నిర్వర్తించవలసిన కర్తవ్య పరాయణత అని ఆమె మోకాలి మీదుగా తలవంచి మృదువైన, లలితమైన ఆ పాదాలను తడిమి ఆప్యాయంగా చుంబించాడు.

ఉలిక్కిపడిన రాధ అదేమిటి వంశీ అంది.

''తప్పా'' జవాబు అదే ''కాదా '' కాదన్నట్లు మరోసారి ముద్దాడాడామె పాదాలను.

కృష్ణయ్యజుట్టు చెరుపుతూ, వేలికి చుట్టి మెలిపెడుతూ నుదుటి నుండి చుబుకంవరకు సున్నితంగా వేలితో రాస్తూ అతడి వక్షఃస్థలం మీద తన శిరస్సునాన్చి ఆ నీలి కళ్లలోకి చూస్తూండిపోయింది.

వేగుచుక్క పొడిచిందెప్పటికో.

పారవశ్యపు పల్లకీ నుండి దిగుతూ కృష్ణుడు రాధా! తెల్లవారబోతూంది'' అన్నాడు.

''అప్పుడేనా ప్రణయ మైకం నుండి తేరుకోని రాధ ముద్దుగా, మగతగా అడిగింది.

''ఓ పిచ్చి ప్రియా! నీ కోసం నా కోసం కాలం ఆగుతుందా? రాధ భుజాలు నెమ్మదిగా కుదుపుతూ

ఆమెను గాఢాలింగనంలో బంధించి రెండు నయనాలపైన ముద్దాడి వెళ్లడానికై లేచి 'నగరానికి వస్తావా?' అనడిగాడు.

రాను వంశీ! నీవు వదలివెళ్లిన గాలిని పీల్చి మళ్లీ నాకు ఆ గాలిని ప్రసాదిస్తాయి. ఇక్కడి వృక్షసమూహాలు. ప్రతి ఆకు తన అంచుల్లో నీవు పలికించిన రాగాలు దాచుకుని చిరుగాలి తాకగానే మళ్లీ మళ్లీ నాకు విన్పిస్తాయి. నీవు ఇక్కడ వేసిన ప్రతి అడుగులో నా అడుగులు వేస్తూ నీ ముందు చేయడానికి కొత్త కొత్త నాట్యాల్ని అభ్యసిస్తాను. వీటిని ఇవ్వలేని ఆ నగరం నాకొద్దు'' అంది రాధ.

సున్నితంగా బుగ్గ మీటి రెండడుగులు ముందుకు వేశాడు కృష్ణుడు.

''వంశీ'' ఎంత అనురాగముందో అంతకు రెట్టింపు వ్యధ ఆ పిలుపులో. కృష్ణుడికి అడుగుపడలేదు.

''పిలవకు రాధీ! ముందుకు సాగలేను'

కృష్ణుడి దగ్గరగా వచ్చి అతడి రెండు చేతులు తన చెక్కిళ్లకానించుకుని ఒక్క క్షణం కళ్లు మూసుకుంది.

త్వరలోనే తిరిగివస్తావు కదూ

''పిచ్చి రాధీ! తన వేలితో ఆమె అధరాలు నిమిరి దగ్గరకు తీసుకుని నుదుట చుంబించి తన ఎడదలో దాచుకున్నాడు.

ప్రకృతి అంతటా ప్రశాంతత.

''వెళ్లొస్తాను రాధీ'' అన్న కృష్ణుడు ముందుకువేసే ప్రతి అడుగు రాధ గుండెలో బరువును పెంచుతోంది. ఆ భారాన్ని మోయులేక తనను కృష్ణుడు వదిలిన చోటనే కూర్చుండిపోయింది.

మళ్లీ నిశ్శబ్దంలో నిశ్శబ్దంగా నిరీక్షణ.

ఎంతగా అనుభవించినా తనివి తీరదు.

ఎంతగా పొందినా గుండె నిండదు.

ఎంతగా పెనవేసుకుపోయినా తపన మాయదు.

●




## అతి తెలుగుతనం

సికింద్రాబాద్ నుంచి విద్యానగర్ వెళ్ళే దోవలోఒక హోటల్ బోర్డు తెలుగు 'పరిశోధకులానికే పెట్టింది. 'ఇక్కడ స్వాధిష్ట భోజనం లభించును' డిలిషస్ ఫుడ్ అన్నదానికి హోటల్ వాళ్ళు వడ్డించిన పద అర్థం అది.